www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 17 ఏప్రిల్ 2025
5
వైఎస్ఆర్

విద్యార్థులకు స్వచ్ఛ ఆంధ్రపై అవగాహన

ప్రజాశక్తి - కడప: ఇ-వేస్ట్ అనేది సమకాలీన ప్రపంచానికి పెద్ద సవాలుగా మారిందని, దీని వ్యాప్తిని నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ సూచించారు. బుధవారం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర, ఇ-వేస్ట్ మేనేజ్మెంట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇ-వేస్ట్‌పై సమగ్ర అవగాహన కల్పించారు. ఫిజిక్స్ లెక్చరర్ బయ్యపురెడ్డి ఇ-వేస్ట్ వల్ల కలిగే ప్రమాదాలు, వాటిని ఎలా నియంత్రించాలి, ఎలా సురక్షితంగా నిర్వహించాలి అనే విషయాలపై వివరించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రమేశ్ మాట్లాడుతూ ఇ-వేస్ట్ మానవ మనుగడకు ప్రమాదకరమని దీనిని సమర్థంగా నిర్వహించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ అంకాల నాగరాజు, రమేశ్ యాదవ్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌సి రుణాలకు కసరత్తు

- రూ.34.40 కోట్లతో రుణాలు
- జిల్లాకు 828 యూనిట్లు
- 60 శాతం గరిష్ట సబ్సిడీ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో ఎస్‌సి రుణాల మంజూరుకు కసరత్తు ఊపందుకుంది. ప్రభుత్వం జిల్లాలోని ఎస్‌సి సామాజిక తరగతుల యువతకు రూ.34.40 కోట్లతో 828 యూనిట్లను ఖరారు చేసింది. ఎస్‌సి కార్పొరేషన్ అధికార యంత్రాంగం ఎస్‌సి రుణాలను మంజూరు చేయడానికి సిద్ధమైంది. అర్హత కలిగిన యువత బ్యాంకు గ్యారెంటీలతోపాటు అధికార యంత్రాంగం ఇంటర్వ్యూలను అధిగమించాల్సి ఉంది. ఎంపికైన నిరుద్యోగ యువత ఎంపిక చేసుకున్న యూనిట్ల పరిశీలనకు జిల్లా అధికారులను బృందాలుగా ఏర్పరచి మానిటరింగ్ చేయనుంది.

జిల్లాలో ఎస్‌సి నిరుద్యోగ యువతకు రూ.34.40 కోట్లతో 828 యూనిట్లతో స్వయం ఉపాధి కల్పనకు ఉపక్రమిస్తున్నది. ఐఎస్‌బి సెక్టార్ టైప్-1, టైప్-2, టైప్-3, ట్రాన్స్‌పోర్ట్ సెక్టార్, అగ్రికల్చర్ సెక్టార్ కింద 32 రకాల స్కీముల ద్వారా రుణాలను మంజూరు చేయనుంది. ఐఎస్‌బి సెక్టార్ టైప్-1 పరిధిలోని ఏడు స్కీములకు 151 మంది లబ్ధిదారులకు యూనిట్‌కు రూ. 2.50 లక్షల నుంచి రూ. 2.95 లక్షలు, ఐఎస్‌బి సెక్టార్ టైప్-2లో 19 స్కీముల్లో 421 మంది లబ్ధిదారులకు యూనిట్ రూ.3.10 లక్ష నుంచి రూ.ఐదు లక్షలు, ఐఎస్‌బి సెక్టార్ టైప్-3 పరిధిలోని [illegible] రూ.20 లక్షలు చొప్పున మంజూరు చేయనుంది. ట్రాన్స్‌పోర్టు సెక్టార్ పరిధిలోని టైప్-1 కింద 249 మంది లబ్ధిదారులకు ప్యాసింజర్ ఆటోకు రూ.మూడు నుంచి రూ.ఎనిమిది లక్షలు, టైప్-2 కింద వెహికల్ యూనిట్‌కు రూ.10 లక్షల చొప్పున అందజేయనుంది. అగ్రికల్చర్ విభాగం కింద డ్రోన్ నిర్వహణ నిమిత్తం ఏడుగురు లబ్ధిదారులకు రూ.10 లక్షల చొప్పున అందజేయనుంది.

సబ్సిడీ కథాకమీషు

ఎస్‌సి సామాజిక వర్గాలకు విడుదల చేసిన వివిధ రుణాలకు 60 శాతం నుంచి 40 శాతం వరకు సబ్సిడీ ఇవ్వనుంది. ఐఎస్‌బి సెక్టార్ టైప్-1 కింద 60 సబ్సిడీ, బ్యాంకులు 35 శాతం, లబ్ధిదారు ఐదు శాతం చొప్పున భరించాల్సి ఉంది. టైప్-2 కింద 40 శాతం సబ్సిడీ, బ్యాంకులు 55 శాతం, లబ్ధిదారు ఐదు శాతం చొప్పున వెచ్చించాల్సి ఉంది. టైప్-3 కింద 40 శాతం సబ్సిడీ, బ్యాంకులు 55 శాతం, లబ్ధిదారు ఐదు శాతం వెచ్చించాల్సి ఉంది. ట్రాన్స్‌పోర్టు సెక్టార్ పరిధిలోని టైప్-1 కింద 50 శాతం సబ్సిడీ ఇవ్వనుంది. బ్యాంకులు 45 శాతం, లబ్ధిదారుడు ఐదు శాతం, టైప్-2 పరిధిలోని రుణాలకు 40 శాతం సబ్సిడీ, బ్యాంకులు 55 శాతం, లబ్ధిదారుడు ఐదు శాతం వెచ్చించాల్సి ఉంది. అగ్రికల్చర్ డ్రోన్ రుణాలకు 40 శాతం సబ్సిడీ, 55 శాతం బ్యాంకర్లు, ఐదు శాతం లబ్ధిదారులు వెచ్చించాల్సి ఉన్నట్లు తెలుస్తోంది.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

ప్రభుత్వం స్వయం ఉపాధి యూనిట్లకు రుణాలు మంజూరు చేయడంతో ఎస్‌సి కార్పొరేషన్ చుట్టూ యువత తిరుగుతోంది. స్వల్పసంఖ్యతో కూడిన ఎస్‌సి రుణాల విచారణను ఎస్‌సి కార్పొరేషన్ అధికార యంత్రాంగం వెల్లడించడం ఉత్సుకతను నింపుతోంది. జిల్లాలోని ఎస్‌సి సామాజిక తరగతులకు చెందిన యువత ఆధార్, రేషన్, కులధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్ వెబ్ సైట్‌ను ఆశ్రయించాల్సి ఉంది. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు స్వయం ఉపాధి యూనిట్లకు తిరిగి ఊపిరిపోయడంతో పెద్దఎత్తున యువత ఎదురు చూస్తోంది.

వీఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలి

జెసికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మనోహర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్ర, వెంకటపతి కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014 సంవత్సరం నుంచి గ్రామ సేవకులకు వేతనాలు పెంచలేదని, వేతనాలు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఇచ్చే వేతనం ఏ మూలకు సరిపోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచిన విఆర్‌ఎల సమస్యలు ఏ ఒక్కటి పరిష్కారం కాలేదని తెలిపారు. రాష్ట్రంలో మంత్రులు, ముఖ్యమంత్రులు మారుతున్నారు కానీ విఆర్‌ఎల కష్టాలు, సమస్యలు తీర్చేవారు లేరని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విఆర్‌ఎలకు పేస్కేలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. మన రాష్ట్రంలో కూడా విఆర్‌ఎలకు పే స్కేల్ అమలు చేయాలని మంత్రులు, అధికారుల చుట్టూ ప్రదక్షణాలు చేస్తున్న కనికరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుకున్న విఆర్‌ఎలు ఎప్పటికైనా విఆర్‌ఓ ప్రమోషన్ వస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నారని, ప్రభుత్వం మాత్రం ప్రమోషన్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. నామినీలుగా పనిచేస్తున్న వారిని విఆర్‌ఎలుగా గుర్తించడం లేదని, ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్న వీఆర్‌ఏలకు వయోభారం పెరుగుతుందని చెప్పారు. దళిత, గిరిజన, మైనార్టీ, బడుగు, బలహీన వర్గాలకు విఆర్‌ఎల కుటుంబాలను ఆకలి బాధల నుంచి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పెరిగిన ధరలకు అనుకూలంగా విఆర్‌ఎలకు పేస్కేలు అమలు చేయాలని, అటెండర్ నైట్ వాచ్‌మెన్ ప్రమోషన్ల శాతాన్ని 70 శాతంకు పెంచాలని, అక్రమ డ్యూటీలను రద్దుచేసి, అర్హులైన విఆర్‌ఎలకు అటెండర్ నైట్ వాచ్‌మెన్‌గా ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి అశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ, శివ, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

పట్టాలు అందుకున్న విద్యార్థులతో వివేకానందరెడ్డి

భవిష్యత్తు కోసం బంగారు బాటలు వేసుకోవాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రతి విద్యార్థి వారి భవిష్యత్తు కోసం బంగారు బాటలు వేసేలా అడుగులు వేయాలని కడప నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రాకేష్ చంద్ర అన్నారు. బుధవారం నగరంలోని స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ప్రీ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ వివేకానందరెడ్డితో కలిసి చిన్నారులకు సర్టిఫికెట్స్ ప్రదానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా రాకేష్‌చంద్ర మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి విద్యతో పాటు సంస్కారం, క్రమశిక్షణ, క్రీడల్లో నైపుణ్యం ఉండాలన్నారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకుని భవిష్యత్‌లో డాక్టర్లు, ఇంజినీర్లు, ఇంకా పై స్థాయి ఐఎఎస్, ఐపిఎస్‌లుగా ఎదగాలని, తద్వారా చదివిన పాఠశాలకు, చదువు చెప్పిన ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకుని రావాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థికి క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడం అభినందనీయమన్నారు. 118 మంది విద్యార్థులు ప్రీస్కూల్ గ్రాడ్యుయేషన్ పట్టాను అందించారు. విద్యార్థులు ఎంతో ఆనందోత్సవాల మధ్య సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి సంధ్య, పిఇటి జయచంద్ర, ఓబుల్‌రెడ్డి, భార్గవి, సరస్వతి, ఈశాంక్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తులను కార్పొరేట్లకు కట్టబెడితే ఊరుకోం

ప్రజాశక్తి - బద్వేలు

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకమని వక్ఫ్ బోర్డ్ ఆస్తులు కార్పొరేట్ శక్తులకు కేంద్ర ప్రభుత్వం కట్టబెట్టాలని చూస్తుందని అలా చేస్తే చూస్తూ ఊరుకోమని డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్ షరీఫ్, ఎస్.కె.ఆదిల్ తెలిపారు. బుధవారం డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అర్ధరాత్రి వక్ఫ్ సవరణ చట్టానికి రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారని పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీలపై భౌతిక దాడులు చేస్తుంటే వాటిని ఖండించకుండా, కేంద్రంలో నరేంద్ర మోడీ ముస్లింలకు న్యాయం చేస్తానని మాయమాటలు చెబుతున్నారని ఈ చట్టం ముస్లింలకు నష్టమే తప్ప లాభం లేదని పేర్కొన్నారు. వక్ఫ్ బోర్డ్ ఆస్తులను అప్పనంగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతున్నారని, పైగా ముస్లింలపై కపట ప్రేమ చూపుతున్నారని, రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో వక్ఫ్ బోర్డు ఆస్తులుపై వ్యతిరేక తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపాలని అలా పంపకపోతే కూటమి ప్రభుత్వం చరిత్ర హీనులుగా మిగిలిపోతారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ముస్లింలకు అనేక హామీలు ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఎటువంటి హామీలను పరిష్కరించకుండా కేంద్ర ప్రభుత్వానికి తొత్తులుగా రాష్ట్ర ఎంపీలు వ్యవహరించడం సరైన పద్ధతి కాదని తెలిపారు. ఈ రాష్ట్ర ఎంపీలు వక్ఫ్ బోర్డు ఆస్తులు కాపాడుకుండా కేంద్ర ప్రభుత్వానికి అండగా ఉండటం సిగ్గుచేటని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్రంలో ఉన్న ఎమ్మెల్యేలు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని పేర్కొన్నారు. అవసరమైతే రాష్ట్ర ఎంపీలు చేత ముస్లిం మైనార్టీలకు అనుకూలంగా వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మైనార్టీల అందరినీ ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షులు పి.యువరాజ్, ఎస్.నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన ఎన్.సుధాకర్

ప్రజాశక్తి-కడప అర్బన్

డిఎస్‌పిగా బాధ్యతలు స్వీకరిస్తున్న సుధాకర్

స్పెషల్ బ్రాంచ్ నూతన డిఎస్‌పిగా ఎన్.సుధాకర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎస్‌పి ఇ.జి.అశోక్ కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. 1991లో పోలీస్ శాఖలో ఎస్ఐగా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలోని పుల్లంపేట, ఓబులవారిపల్లె, చిట్వేల్, వేముల, వేంపల్లి, చక్రాయపేట, కొండాపురంతో పాటు పలు పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వర్తించారు. సిఐగా ఉద్యోగోన్నతి పొందిన అనంతరం తిరుపతి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, బనగానపల్లి సర్కిల్, అదోనిలలో విధులు నిర్వహించారు. డిఎస్‌పిగా ఉద్యోగోన్నతి పొంది ఎస్‌సి ఎస్టీ సెల్ విభాగంలో నెల్లూరు, అన్నమయ్య జిల్లాలో పనిచేశారు. ఇటీవల రాజంపేట డిఎస్‌పిగా పనిచేస్తూ బదిలీలలో భాగంగా కడప స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పిగా విధుల్లో చేరారు. తన సర్వీస్‌లో అత్యుత్తమ సేవలందించినందుకు అనేక రివార్డులతో పాటు 2010లో సేవా పతకంతో పాటు 2022లో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక ఉత్తమ సేవా పతకం అందుకున్నారు.

వివేకానంద హైస్కూల్ గుర్తింపు రద్దు

ప్రజాశక్తి-కడప అర్బన్

కమలాపురంలోని వివేకానంద ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ గుర్తింపు రద్దు చేసినట్లు డిఇఒ షంషుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు సమీప పాఠశాలలో చేరాలని పేర్కొన్నారు. నూతన అడ్మిషన్స్ చేయకూడదని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు.

రెవెన్యూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

ప్రజాశక్తి - కడప

రెవెన్యూ అధికారులు అన్నిరకాల జిఒలు, చట్టాలపై అవగాహన పెంచుకుని తమ పనితీరు మెరుగుపరచుకొని బాధ్యతాయుతంగా, జవాబుదారి తనంతో పనిచేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని సభా భవన్‌లో కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల రెవెన్యూ డివిజన్ల పరిధిలోని తహశీల్దార్లు, టిడిలు, విఆర్‌ఒ, మండల సర్వేయర్లతో వివిధ రకాల రెవెన్యూ అంశాలపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవిన్యూ సేవలలో వేగం, నాణ్యత, పారదర్శకత ముఖ్యమన్నారు. పనితీరులో ప్రమాణాలు పెంచుకోవాలన్నారు. ప్రజలతో కలిసి మెలిసి మమేకం కావాలని, చట్ట ప్రకారం మార్గదర్శకాలు మేరకు పని చేయాలని సూచించారు. వ్యవస్థలో లోపాలు సరిదిద్దుకొని ముందుకు వెళ్లగలిగినప్పుడే శాఖకు మంచి పేరు వస్తుందన్నారు. ఏలాంటి సమస్య అయినా కాలాతీతం చేయకుండా వేగంగా స్పందించి చట్టప్రకారం చర్యలు చేపట్టి నాణ్యతగా పరిష్కరించాలన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా అందిన దరఖాస్తులను ఆయా గ్రామాల వారిగా క్రోడీకరించుకోవాలని సూచించారు. ప్రతి వారం పిజిఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై ముఖ్యమంత్రి కార్యాలయం సమీక్ష చేస్తోందన్నారు. అత్యంత ప్రాధాన్యత కలిగిన ఈ కార్యక్రమంలో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించడమే మన బాధ్యత అని తెలియజేశారు. సమస్యలపైన అవగాహన పెంపొందించడానికి తహశీల్దార్లు ప్రతి రోజు ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని, ఆ గ్రామంలోని సమస్యలపై దృష్టిసారించి పరిష్కార మార్గాలను వెదుకుతూ విజయవంతంగా మండల స్థాయిలో రెవెన్యూ సేవల పనితీరును మెరుగు పరచడం జరుగుతోందన్నారు. వేగంగా స్పందించి క్షేత్రస్థాయిలో వాస్తవాలను విచారణ చేసి చట్టప్రకారం చర్యలు తీసుకొని అర్జీలను నాణ్యతగా సమస్యను పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం చేయడం, నిర్లక్ష్యం వహిస్తే మాత్రం చర్యలు తప్పవని హెచ్చరించారు. భూముల అంశంలో నిబంధనలను దృష్టిలో ఉంచుకొని క్షేత్రస్థాయిలో పారదర్శకంగా విచారణ చేసి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. గ్రామ స్థాయిలో గుర్తించిన అర్జీలను పరిష్కరించడానికి నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల్లో రెవెన్యూ అధికారులు వారంలో నాలుగు రోజులు విజిట్ చేసి పూర్తి అవగాహనతో పరిష్కరించాలన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ ఎంక్వయిరీలు నిర్వహించేటప్పుడు సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో కలసి పనిచేయాలన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమించుకునే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు రెవెన్యూ అధికారులు అసైన్డ్ భూములు, ఆర్ఒఆర్, పట్టాదారు పాస్ పుస్తకాలు, చట్టాలు తదితర అంశాలపై పూర్తి అవగాహన కలిగి పని చేయాలన్నారు. 1142 జిఒ ప్రకారం ఎలాంటి భూములను ఎవరికి అసైన్ చేయాలనే అంశానికి సంబంధించి విధివిధానాలపై, రీ సర్వే, వెబ్ లాండింగ్, మ్యుటేషన్స్ మొదలైన అంశాల్లో క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులకు ఎదురయ్యే సమస్యలు, అనుభవాలపై సమీక్ష నిర్వహించి, ఆయా రెవెన్యూ డివిజన్ అధికారులకు, తహశీల్దార్లకు పునశ్చరణ అవగాహన కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడు, కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్‌డిఒలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, చిన్నయ్య, ల్యాండ్స్ సర్వే ఎడి మురళీకృష్ణ, నాలుగు రెవెన్యూ డివిజన్ల తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, సర్వేయర్లు, విఆర్‌ఒలు, తదితర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు గొప్ప వారి చరిత్రను చదవాలి

- వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పద్మ

కందుకూరికి నివాళులర్పిస్తున్న వైవీయూ రిజిస్ట్రార్ పద్మ

ప్రజాశక్తి-కడప అర్బన్

విద్యార్థి దశలో గొప్ప వారి చరిత్రలు చదివి వారి ఆదర్శనీయమైన ఆలోచనలను జీవితానికి అన్వయించుకొని అనుసరించాలని యోగి వేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ అన్నారు. వైవీయూ లలిత కళల శాఖలో కందుకూరి వీరేశలింగం జయంతి సందర్భంగా 'నాటక రంగ దినోత్సవం' బుధవారం నిర్వహించారు. కందుకూరి చిత్రపటానికి వైవీయూ రిజిస్ట్రార్ పి.పద్మ, డీన్ కె.గంగయ్య, శాఖ హెడ్ కె.మృత్యుంజయరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం బాల్య వివాహాలను నిషేధించడం, వితంతు వివాహాలను ప్రోత్సహించడంతో పాటూ బాలికల విద్య కోసం కృషి చేసిన మహానుభావుడని వివరించారు. నాటక రంగానికి ఆయన చేసిన కృషి గొప్పదని, మొట్టమొదటి తెలుగు నవల రాజశేఖర్ చరిత్ర ఆయన రాసినదేనన్నారు. నాటకాలు సంస్కృతికి గుర్తులని నటులను సన్మానించుకోవడం సంస్కృతిని కాపాడుకోవడమేనన్నారు. హిస్టరీ అండ్ ఆర్కియాలజీ ప్రొఫెసర్, ఆర్ట్స్ అండ్ హ్యుమానిటీస్ డీన్ ప్రొఫెసర్ కె.గంగయ్య మాట్లాడుతూ దేశ సంస్కృతిని కాపాడేవీ నాటకాలేనని తెలిపారు. భారతదేశంలో సంఘసంస్కర్తలు వారి ఆదర్శనీయమైన జీవితాలను గుర్తుకు తెచ్చారు. ఫైన్ ఆర్ట్స్ డిపార్ట్మెంట్ హెచ్ఒడి డాక్టర్ మృత్యుంజయరావు మాట్లాడుతూ నాటకాలు సమాజాన్ని ప్రభావితం చేస్తాయని ఒక మంచి మార్గంలో మనల్ని తీసుకు వెళ్తాయని తెలిపారు. ఫైనార్ట్ శాఖకు అధికారులు అందిస్తున్న సహకారం వల్లనే శాఖ అభివృద్ధి జరుగుతోందన్నారు. అనంతరం నాటక రంగంలో అనేక నంది అవార్డులు, హంస అవార్డులు, కందుకూరి పురస్కారాలు అందుకున్న రంగస్థల కళాకారులు, నటులు అయిన కొడవలూరు చంద్రశేఖర్ రాజు, ఎడవల్లి కృష్ణమూర్తి, పి.యశోద, డాక్టర్ నీలం బాలగంగాధర్ తిలక్ ను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమాన్ని లలిత కళల శాఖ అధ్యాపకులు డాక్టర్ కొప్పోలురెడ్డి శేఖర్ రెడ్డి సభా సమన్వయం చేశారు. ఈ సందర్భంగా నటులు పద్యాలను, నటనలోని కొన్ని సన్నివేశాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో లలిత కళల శాఖ అధ్యాపకులు సిహెచ్ వెంకటేష్, బి.చినరాయుడు, బి.వీరప్ప, ఎం.వాసవి, చంటి సూరి, సిద్ధి రాజ్, టెక్నికల్ అసిస్టెంట్ వి. సుధాకర్, ఆఫీస్ సిబ్బంది లక్ష్మయ్య , విద్యార్థులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం : జడ్జి

ప్రజాశక్తి - కడప: జాతీయ న్యాయసేవాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా మే నెల పదవ తేదీన నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకొని సత్వర న్యాయం పొందాలని మొదటి అదనపు జిల్లా జడ్జి, జిల్లా ఇన్‌ఛార్జి ప్రధాన న్యాయమూర్తి, డిఎల్ఎస్ఎ చైర్మన్ ఎల్.వెంకటేశ్వరరావు, సీనియర్ సివిల్ జడ్జి, డిఎల్ఎస్ఎ సెక్రటరీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. పూర్తి సమాచారం కోసం 08562-258622, 244622 నంబర్లకు ఫోన్ ద్వారా గాని, kadapa.dcourts.gov.in, dlsakdp@gmail.com ఈ మెయిల్ అడ్రస్ ద్వారా గాని సంప్రదించవచ్చునని తెలిపారు.

నేడు కలెక్టరేట్ ఎదుట డివైఎఫ్ఐ ధర్నా

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రభుత్వం డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదలలో జాప్యాన్ని నిరసిస్తూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించే ధర్నా జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డిఎస్సీ అభ్యర్థులకు ఇదిగో, అదిగో డిఎస్‌సి అని కాలయాపన చేస్తుందని తెలిపారు. ప్రభుత్వాలు మారుతున్న డీఎస్సీ అభ్యర్థులకు మాత్రం నోటిఫికేషన్ విడుదల జాప్యం తప్పడం లేదని తెలిపారు. డిఎస్సి నోటిఫికేషన్ తక్షణమే విడుదల చేయాలని కోరుతూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కడప కోటిరెడ్డి సర్కిల్ నుంచి ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ వద్ద జరిగే నిరసన ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని పేర్కొన్నారు.

పిఎఫ్ కార్యాలయం వద్ద నిరసన చేస్తున్న నాయకులు

చట్టాలను దుర్వినియోగం చేస్తున్న బిజెపి : డిసిసి

ప్రజాశక్తి - కడప

రాజకీయం పేరుతో బిజెపి కుట్రలు పన్నుతూ చట్టాలను దుర్వినియోగం చేస్తుందని డిసిసి అధ్యక్షులు ఎన్.డి.విజయజ్యోతి అన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియాగాంధీ, రాహుల్ గాంధీపై ఛార్జ్‌షీట్ దాఖలు చేయడానికి నిరసిస్తూ బుధవారం పిఎఫ్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశ ప్రజాస్వామ్యానికి అవమానంగా, రాజకీయం పేరుతో చట్టాలను ముసుగు చేసుకుని ప్రతిపక్ష నాయకులపై దాడులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఇదిని బిజెపి ప్రభుత్వం రాజకీయ రీత్యా దుర్వినియోగం చేస్తోందన్నారు. ఈ చర్యలు పూర్తిగా కాంగ్రెస్ నాయకులను కలుషితపరచాలనే కుట్ర పూరితంగా సాగుతున్నాయని విమర్శించారు. ఇది ప్రజాస్వామ్యంపై దాడి, స్వేచ్ఛాయుత భావప్రకటనపై మచ్చలేసే చర్యని తెలిపారు. రాజకీయ ప్రత్యర్థులను అణిచివేయడానికి విచారణ సంస్థలను వ్యక్తిగత ప్రయోజనాల కోసం వాడుకుంటోందన్నారు. కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి పటాన్ మహమ్మద్ అలీఖాన్, ప్రొద్దుటూరు, కమలాపురం అసెంబ్లీ సమన్వయకర్త ఇర్ఫాన్‌బాషా, అశోక్ కుమార్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు, నాయకులు రహమతుల్లాఖాన్, షేక్ నీలం, చిన్న కుల్లాయప్ప, పాలెం హరిప్రసాద్, సిరాజుద్దీన్, కదిరి ప్రసాద్ గౌడ్, సునీత, సిద్ధిక్, సద్దాం, శివారెడ్డి పాల్గొన్నారు.

21న ఆర్ట్స్ కళాశాలలో జాబ్ ఫెస్ట్

ప్రజాశక్తి-కడప అర్బన్

కమిషనరేట్ ఆఫ్ కాలేజీ ఎట్ ఎడ్యుకేషన్ వారి ఆదేశాల మేరకు ఆర్ట్స్ కళాశాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సంయుక్తంగా ఎపిఎస్ఎస్‌డిసి సౌజన్యంతో ఆర్ట్స్ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 21న జాబ్ ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ జి.రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేట్, ఎయిడెడ్ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. సుమారు 21 కంపెనీలు పాల్గొంటారని వెయ్యి మందికి పైగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్ ఫెస్ట్‌లో పాల్గొంటున్న కంపెనీలు కెఎల్ గ్రూప్, హెటరో, ఎల్ఐసి, గ్రీన్ టెక్, హేటరో, హెచ్డిఎఫ్సి బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, డోను బిపిఓ, జప్టో, ఎన్నో సోర్స్, నవభారత్, ఎఐఎల్ డిక్షన్, డైకిన్, ఎయిర్టెల్ పేమెంట్, షిరిడి సాయి ఎలక్ట్రికల్స్, పేటీఎం, నవత ట్రాన్స్పోర్ట్, స్కైగార్డ్ మొదలైన కంపెనీలు పాల్గొంటాయని ప్రతి ఒక్కరు అవకాశాన్ని ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. ఈ జాబ్ డ్రైవ్‌లో పాల్గొనదలచిన అభ్యర్థులు బయోడేటా/రెస్యూమ్/ఆధార్‌తోపాటు సర్టిఫికెట్ల జిరాక్సు ప్రతులతో హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు కళాశాలలోని 9347256400, 9390052901 సంప్రదించాలని పేర్కొన్నారు.

అప్రమత్తతతో అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట : ఎస్‌పి

ప్రజాశక్తి-కడప అర్బన్

అప్రమత్తత, సమన్వయం, సహకారంతోనే అంసాఘిక శక్తులకు అడ్డుకట్ట పడుతుందని ఎస్‌పి ఇ.జి.అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం మహిళలు, చిన్నారుల భద్రతే లక్ష్యంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శక్తి టీమ్స్, వారు వినియోగించనున్న 56 ద్విచక్ర వాహనాలను ఎస్‌పి జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలు వద్ద జెండా ఊపి ప్రారంభించారు. పెన్నార్ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతనంగా ఏర్పాటు చేసిన శక్తి టీమ్స్‌తో ఎస్‌పి మమేకమై వారు నిర్వర్తించే విధులు, చేపట్టాల్సిన కార్యక్రమాలను సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో మహిళల పట్ల ఎటువంటి దాడులు, అఘాయిత్యాలు, వేధింపులు లేకుండా చేసేందుకుగాను ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో 'శక్తి టీమ్స్'ను జిల్లాలో ఏర్పాటు చేసిందని తెలిపారు. శక్తి టీమ్స్ జిల్లాలోని కళాశాలలు, పార్కులు, రద్దీ ప్రదేశాలు, కాలేజీలు, షాపింగ్ మాల్స్, ఆర్టీసీ బస్టాండ్లు, ముఖ్య కూడళ్లలో నిఘా ఉంచాలన్నారు. ఈ శక్తి టీమ్స్ బహిరంగ ప్రదేశాల్లో మహిళలు, పిల్లలపై వేధింపులు అరికట్టడం, నేరాలను నిరోధించడం, తక్షణ సాయం అందించి వారికి రక్షణ కవచంగా నిలిచేలా విధులు నిర్వహించి నేరాల శాతాన్ని తగ్గించాలని, మహిళలపై వేధింపులు, ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే అసాంఘిక శక్తులను చట్ట ప్రకారం శిక్ష పడేలా చూడాలన్నారు. మహిళలకు, చిన్నారులకు ఆపదలో మేమున్నామంటూ ఓ వైపు ధైర్యాన్నిస్తూ..అరాచక శక్తుల ఆట కట్టించాలన్నారు. మహిళా వివక్ష, హింస, లైంగిక వేధింపులకు సమాజంలో స్థానం లేదన్నారు. నేరాలకు అడ్డుకట్ట వేసేలా ప్రభావవంతంగా విధులు నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, అదనపు ఎస్‌పి (ఎఆర్) బి.రమణయ్య, మహిళా పోలీస్ స్టేషన్ డి.ఎస్.పి ఎస్.రమాకాంత్, ఎఆర్ డిఎస్‌పి కె.శ్రీనివాసరావు, ఆర్ఐలు వీరేష్, ఆనంద్, మహిళా పిఎస్ సిఐఎల్లమరాజు, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, ఇసి మెంబర్ మాధవీలత, సిబ్బంది పాల్గొన్నారు.

స్కూటర్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్‌పి అశోక్‌కుమార్

చెక్కు చెదరని బ్రిటీష్ కట్టడం

కెసి కెనాల్ బంగ్లా

ప్రజాశక్తి - చాపాడు

వందేళ్ల క్రితం నిర్మించిన కెసి (కర్నూలు-కడప) కెనాల్ బంగ్లా నేటికీ చెక్కు చెదరలేదు. కెసి కాలువ అధికారుల కోసం బ్రిటిష్ వారు నిర్మించిన బంగ్లా నేటికి ఏమాత్రం దెబ్బ తినలేదు. 1895-1905 మధ్య కాలంలో కెసి రవాణా కాలువను వ్యవసాయ సాగు నీటి కాలువగా బ్రిటిష్ వారు మార్పు చేశారు. కాలువకు సంభందించిన సిబ్బంది, అధికారులు ఉండేందుకు అనుగుణంగా చాపాడు మండల పరిధిలోని అయ్యవారిపల్లె సమీపంలో రెండు పెద్ద భవనాలను నిర్మించారు. వీటిని కెసి బంగ్లా అని పిలుస్తారు. చాలా సంవత్సరాలుగా ఇవి నిరుపయోగంగా ఉన్నాయి. విశాలమైన గదులు, ఆరుబయట విశాలమైన స్థలం, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ భవనాలు ఉన్నాయి. చాలా కాలంగా నిరుపయోగంగా మారడంతో ఈ బంగ్లా ఆవరణం అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. ఈ భవనాలకు చిన్నపాటి మరమత్తులు చేస్తే వాడుకలోకి వస్తాయి. ప్రభుత్వ కార్యాలయాలకు, పాఠశాలకు లేదా సిబ్బందికి భవనాలుగా ఉపయోగించుకోవచ్చు. కేసి కెనాల్‌కు సంబంధించిన ఆస్తులు కావడంతో వాటిని మండలస్థాయి అధికారులు పట్టించుకోవడం లేదు. జిల్లా స్థాయి అధికారులు ఈ బంగ్లా ప్రదేశాన్ని పరిశీలించి, భవనాలను ఉపయోగంలోకి తీసుకొస్తే ఉపయోగకరంగా ఉంటుంది. ఈ ప్రాంతంలో చెట్లు ఎక్కువగా ఉండడంతో వేసవిలో పిల్లలు ఆడుకుంటూ సేద తీరుతుంటారు. పశువులు కూడా చల్లగా ఉండడం వల్ల ఇక్కడే ఉంటాయి.

ఆహ్లాదకర వాతవరణంలో భవనాలు

వినతిపత్రం అందజేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ఫ్లడ్ లైట్లు వెలిగేలా చూడాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు-ప్రొద్దుటూరు బైపాస్‌లో ఫ్లడ్ లైట్లు వెలిగేలా చూడాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ కోరారు. ఆ మేరకు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటరామిరెడ్డికి డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ కొద్ది రోజులుగా ప్రొద్దుటూరు బైపాస్ ప్రాంత కూడలిలో ఉన్న ఫ్లడ్ లైట్లు వెలగడంలేదన్నారు. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా హైవే పనులు జరుగుతుండడం, రోడ్డు మార్గం వన్ వే కావడంతో రాత్రి సమయంలో లైట్లు లేక ప్రజలు, వాహనదారులు మరింత ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రోడ్డు ప్రమాదాలు కూడా జరిగే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. సమస్యను గుర్తించి మరమ్మతులు చేయాలని కోరుతున్నామన్నారు. మున్సిపల్ కమిషనర్ స్పందించి త్వరలో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షులు సుబహాన్ పాల్గొన్నారు.

తాగునీరు కలుషితం

కుళాయిల నుంచి కలుషిత నీరు - ప్రజల్లో ఆందోళన

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక బిడ్డల మిట్ట ప్రాంతంలో డ్రయినేజీ కాలువల్లో ఉన్న పైపులైన్ లీక్ కావడంతో తాగునీరు కలుషితం అవుతోంది. కుళాయిల్లో నుంచి మురికి నీరు నల్లగా వస్తోంది. ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రజలు ఆ నీటిని చూసి ఆందోళన చెందుతున్నారు. కొద్ది రోజులుగా కుళాయిల్లో నుంచి మురికి నీరు వస్తూ ఉండడంతో పంచాయతీ సిబ్బందికి ప్రజలు సమాచారం ఇచ్చారు. అయినా పట్టించు కునే వారు లేరని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఈ నీటితో వ్యాధులు వస్తాయని ఆందోళన చెందుతున్నారు. డ్రయినేజీ కాలువల్లో ఎక్కువగా తాగునీటికి చెందిన పైపులైన్లు ఉన్నాయి. ఎక్కడో పైపులైన్ లీకేజీ కావడంతో తాగునీటి సరఫరా చేసినప్పుడు మురికి నీరు అందులో వస్తున్నట్లు వాపో తున్నారు. పంచాయతీ కార్యాలయంలో ఇఒ లేకపోవడంతో ఎవరికి ఫిర్యాదు చేయాలో అర్థం కావడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. మరో వైపు సిబ్బందికి జీతాలు రాకపోవడం వల్ల వారు కూడ ప్రజలు చేసిన ఫిర్యాదులను పట్టించుకోవడంలేదని ప్రజలు పేర్కొంటున్నారు. మురికి నీరు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మహిళలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గ్యాస్ వినియోగంపై మహిళలకు అవగాహన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

గ్యాస్ వినియోగంపై అగ్నిమాపక కేంద్ర సహాయ జిల్లా అధికారి రఘునాథ్ అవగాహన కల్పించరు. స్థానిక అమృత్ నగర్, ఖాదరబాద్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ ఇంటిలో గ్యాస్ సిలిండర్ చుట్టూ ఎలాంటి మండే పదార్థాలు ఉంచకూడదన్నారు. గ్యాస్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వంట పూర్తయిన వెంటనే రెగ్యులేటర్ పూర్తిగా ఆఫ్ చేసి ఉంచాలని సూచించారు. ఊరికి వెళ్లాలంటే సిలిండర్ నుంచి రెగ్యులేటర్ పూర్తిగా వేరుచేయాలన్నారు. గ్యాస్ ఇంటిలో లీక్ అయినట్లు అనుమానం వస్తే ఇంటిలోని ఎలక్ట్రానిక్స్ స్విచ్‌లు ఆన్ ఆఫ్ చేయరాదని, కిటికీలు తలుపులు నెమ్మదిగా తెరవాలన్నారు. రెండు సిలిండర్లు ఉన్నవారు ఒకటి కిచెన్‌లో, మరొకటి హాల్‌లో ఉంచుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఒకే చోట రెండు సిలిండర్లు ఉంచకూడదని సూచించారు. ఫైర్ సిబ్బంది, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

అదుపు తప్పి ట్రాక్టర్ చెరువులో బోల్తా

ప్రజాశక్తి - పెద్దముడియం

గ్రామ పంచాయితీకి చెందిన చెత్తను సేకరించే ట్రాక్టర్ అదుపు తప్పి చెరువులో బోల్తా పడిన ఘటన బుధవారం పెద్ద పసుపులలో జరిగింది.

ఉదయాన్నే గ్రామంలో చెత్తను సేకరించి ఊరి శివార్లలో ఉన్న డంపు యార్డులో చెత్తను వదిలి తిరిగి వస్తుండగా ట్రాక్టర్ అదుపు తప్పింది. డ్రైవర్ దావీదు వెంటనే కిందికి దూకడంతో స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న గ్రామ పంచాయితీ సిబ్బంది క్రేన్ సాయంతో ట్రాక్టర్‌ను బయటకి తీశారు. చెరువు కట్టపై ఉన్న రోడ్డు వర్షపు నీటి కోతకు గురి కావడంతో పక్కన ఉన్న మట్టి మొత్తం కొట్టుకు పోయింది. రోడ్డు ఇరుకు మారింది. పూర్తిగా నీటితో నిండిన చెరువు కట్టపై ఎలాంటి రక్షణ గోడలు లేక పోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువుకు రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రఘునాథ్‌బాబుకు పిహెచ్‌డిలో పట్టా

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని జెఎన్టీయూ కళాశాలలో పనిచేస్తున్న రఘునాథ్ కుమార్ బాబుకు సైబర్ సెక్యూరిటీలో పరిశోధన చేసినందుకు పిహెచ్‌డిలో పట్టా ఇచ్చారు. జెఎన్టీయూ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రఘునాథ్ కుమార్‌బాబు చెన్నైలోని బిగ్ డేటా విత్ సైబర్ సెక్యూరిటీలో గత నాలుగేళ్లుగా పిహెచ్‌డి చేస్తున్నారు. ఆ మేరకు ఈనెల 15న పట్టా ఇచ్చారని రఘునాథ్ కుమాం బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను కళాశాల అధ్యాపకులు అభినందించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - చాపాడు

ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సిబ్బందికి వినతి పత్రాన్ని అందజేశారు. నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్లు మాట్లాడుతూ 19 సంవత్సరాల సర్వీసును గుర్తించి గ్రామ పంచాయతీ ఉద్యోగులుగా గుర్తించి విధులను క్రమబద్ధీకరించాలన్నారు. మండలం యూనిట్‌గా తీసుకొని అంతర్గత బదిలీలు చేయడం ద్వారా స్థానిక ఒత్తిడి తగ్గించాలన్నారు.

మాట్లాడుతున్న సాల్మన్

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కార్మిక సంఘ (సిఐటియు అనుబంధం)ప్రొద్దుటూరు శాఖ ప్రధాన కార్యదర్శి సాల్మన్ కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బుధవారం రెండోరోజు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చనిపోయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబంలో ఉద్యోగం ఇవ్వాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలన్నారు. ప్రయివేట్ ఏజెన్సీలు వద్దు అన్నారు. తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయా లన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ధర్నాలో మున్సి పల్ గౌరవ అధ్యక్షులు సత్యనారాయణ, జిల్లా సిఐటియు నగర కార్యదర్శి వెంకట సుబ్బయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయకుమార్, పట్టణ కోశాధికారి రాఘవేంద్ర, పట్టణ కమిటీ సభ్యులు గురమ్మ, రమాదేవి, నీతమ్మ, ప్రమీలమ్మ, అన్నపూర్ణ, మోహన్, జాకోబు, నరసమ్మ, మరియమ్మ పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామని సిఐటియు పట్టణ అధ్యక్షులు జి.ఏసుదాసు, కార్యదర్శి దాసరి విజయ్ తెలిపారు. స్థానిక మాస్టర్ పాయింట్ వద్ద బుధవారం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు పారిశుధ్య కార్మికులకు ఇచ్చిన హామీని నిలపెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో మైఖేల్, గ్రేస్ అమ్మ, రవి, బాలు, ప్రమీలమ్మ, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై ఎంపీకి వివరిస్తున్న బాబురెడ్డి

అరటి రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - లింగాల

అరటి రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని వైసిపి మండలశాఖ అధ్యక్షులు బాబురెడ్డి విమర్శించారు. కడప ఇన్‌ఛార్జి మంత్రి సవితమ్మ, టిడిపి నాయకులు క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న అరటి పంటను పరిశీలించి ఫోటోలకు ఫోజులివ్వడం తప్ప అరటి బాధితులను ఆదుకునే విషయంలో వైఫల్యం చెందారని పేర్కొన్నారు. గడిచిన నెల రోజుల్లో అకాల వర్షాలు, వీచిన గాలులకు మూడు వేల ఎకరాల్లో అరటి పంట దెబ్బతిందన్నారు. అయినా ప్రభుత్వన్నికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. అరటి రైతుల వేదనను బుధవారం కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.స్పందించిన ఎంపీ మాట్లాడుతూ నష్టపోయిన అరటి రైతులకు కూటమి ప్రభుత్వం సాయం చేయకపోతే రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడుదామన్నారు.

పిఎండిఎస్ విత్తన గుళికలతో ప్రయోజనం

ప్రజాశక్తి - ముద్దనూరు

ఘనజీవామృతం, బూడిదతో తయారు చేసిన విత్తన గుళికలను వర్షాధార పొడి నేలల్లో విత్తడం వల్ల తక్కువ వర్షపాతంలో కూడా విత్తనాలు మొలకలు వస్తాయని ప్రకృతి వ్యవసాయ ఎన్ఎఫ్ఎ మేరీ తెలిపారు. బొందలకుంట యూనిట్‌లోని బడుగువారిపల్లె గ్రామంలో బుధవారం మేరీ ఆధ్వర్యంలో 30 రకాల విత్తనాలను బీజామృతంతో విత్తన శుద్ధి చేసే విధానం గురించి రైతులకు అవగాహన కల్పించారు. బీజామృతంతో విత్తన శుద్ధి చేసిన విత్తనాలకు ముందుగా బంక మట్టితో కోటింగ్ చేయాలన్నారు. అనంతరం ఘనజీవామృతం, బూడిద చల్లి విత్తన గుళికలు తయారు చేసినట్లు తెలిపారు. దీన్ని పిఎండిఎస్ విధానం అంటారన్నారు.భూమిని పలు పంటలతో కప్పి ఉంచడం వల్ల ఎండకు భూమిలోని సూక్ష్మజీవులు చనిపోకుండా భూమిలోని తేమ శాతం ఆరిపోకుండా ఉంటుందన్నారు. విత్తన గుళికలు తయారు చేసి పొడి నేలల్లో విత్తడం వల్ల విత్తనం భూమిలో చెడిపోకుండా 6 నెలల వరకు జీవంతో ఉంటుందన్నారు. వర్షాధార భూముల్లో ఈ పద్దతి పాటించాలని రైతులకు వివరించారు. కార్యక్రమంలో డిఎంఎం టి.నుజహత్, యూనిట్ ఇన్‌చార్జిలు మునిభూపాలుడు, రామసుధ, ఐసిఆర్పిలు వెంకటరమణయ్య, రాధిక, సల్మా, శ్రీదేవి, పుష్ప, యమున, రామాంజనమ్మ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

పోషకాహారం తప్పనిసరి

ప్రజాశక్తి - వేముల

గర్భిణులు, బాలింతలు, కిశోర బాలలు పోషకాహారం తప్పక తీసుకోవాలని సిడిపిఒ వి.సునీత తెలిపారు. స్థానిక కెకె కొట్టాల గ్రామ పంచాయతీలో బుధవారం పోషణ పక్వాడ కార్యక్రమాన్ని కెకె కొట్టాల అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించారు.ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లా డుతూ ఆహారంలో ఆకుకూరలు, కాయగూరలు ఉండాలన్నారు. కార్యక్ర మంలో సూపర్వైజర్ హసీనా, అంగన్వాడీ కార్యకర్త, సహాయకురాలు పాల్గొన్నారు.

లింగాల : గర్భిణులు వారి ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని, తప్పనిసరిగా స్కానింగ్ పరీక్షలు చేయించుకోవాలని మండల ఇన్‌ఛార్జి వైద్యాధికారి స్రవంతి తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం గర్భిణులకు గైనకాలజిస్ట్ శరణ్య ప్రత్యేక వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్కానింగ్ పరీక్షల ద్వారా బిడ్డ ఎదుగుదల, రక్తహీనత, ఆహార పదార్థాలు, నెలనెల పరీక్షలపై తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్, ఎంఎల్‌హెచ్‌లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

'కందుకూరి' గొప్ప సంఘ సంస్కర్త, రచయిత

ప్రజాశక్తి - వేంపల్లె

కందుకూరి వీరేశలింగం పంతులు గొప్ప సంఘసంస్కర్త, రచయిత, నవ్యాంధ్ర వైతాళికుడని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసిరెడ్డి అన్నారు. కందుకూరి 177వ జయంతిని కాంగ్రెస్ నాయకులు బుధవారం వేంపల్లెలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాహిత్యాన్ని శక్తివంతమైన ఆయుధంగా చేసుకుని బాల్య వివాహాలు, స్త్రీల పట్ల వివక్ష, అవిద్య, అవినీతి, సాంఘిక దురాచారాలను రూపుమాపుటకు కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త అని శ్లాఘించారు. స్త్రీ విద్యను, వితంతు వివాహాలను ప్రోత్సహించారని తెలిపారు. సంఘ సంస్కరణలతో పాటు తెలుగు బాషాభివృద్ధికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సుబ్రమణ్యం, రామకృష్ణ, అమర్‌నాథ్ రెడ్డి, ఉత్తన్న, బద్రి, నాగరాజు, రమణ, వినయ్, వెంకటేష్, మాస్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి

- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు డిమాండ్

ప్రజాశక్తి - చక్రాయపేట

చక్రాయపేటను కరువు మండలంగా ప్రకటించాలని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి మాధవి బాలకృష్ణ అధ్యక్షతన ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కె.కులాయమ్మ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. చక్రాయపేట మండలం వెనుకబడిన ప్రాంతంగా సభ్యులు వివరించారు. తాగునీటి సమస్యతోపాటు ఏడాదికి ఒక్కసారి పంట దిగుబడే అయ్యే మామిడి చెట్లకు కూడా నీరు లేదని తెలిపారు. మామిడి, నిమ్మ చెట్లకు కూడా ట్యాంకర్లతో ప్రభుత్వం నీటిని సరఫరా చేయాలని చక్రాయపేట ఎంపిటిసి ఇందుకూరి లీలావతితోపాటు మరికొందరు సభ్యులు కోరారు. కె.రాజుపల్లె పాపాగ్ని నది ఒడ్డున దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఏర్పాటు చేసిన మంచినీటి పథకం నుండి చిలేకంపల్లి, గడ్డంవారి పల్లెలతో పాటు మరికొన్ని గ్రామాలకు తాగునీటిని అందించాలని కోరారు. సమావేశంలో ఉప మండల అధ్యక్షుడు వేదమూర్తి, మండల కో-ఆప్షన్ మెంబర్ గౌస్ లాజం, ఎంపిటిసిలు ఇందుకూరు లీలావతి, గఫూర్, నారమ్మ, నవసత్ బి, సర్పంచులు లక్ష్మయ్య, నరసింహులు, హరిశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ రమేష్‌రెడ్డి, పిఆర్ రామకృష్ణ, సిహెచ్‌ఒ వెంకట్రామిరెడ్డి, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

దొంగచాటు ఓటింగ్‌పై వైసిపి సమాధానం చెప్పాలి

ప్రజాశక్తి - వేంపల్లె

వక్ఫ్ సవరణ బిల్లుకు సంబంధించి రాజ్యసభలో వైసిపి ఎంపీలు దొంగచాటుగా వేసిన ఓటింగ్‌పై సమాధానం చెప్పాలని టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలో టిడిపి మండల మైనార్టీ కన్వీనర్ తెలంగాణ వలితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల వక్ఫ్ బిల్లుపై జరిగిన ముస్లింల సమైక్య ర్యాలీలో చంద్రబాబుపై వైసిపి అనాలోచిత మాటలు మాట్లాడడం తగదన్నారు. ముస్లింలు అందరూ కలిసి సమైక్యంగా చేసిన ర్యాలీలో రాజకీయం చేయడం వైసిపికి ఏమాత్రం మంచిది కాదన్నారు. వైసిపి నాయకుడు రాజకీయాలపై మాట్లాడిన తర్వాతనే తాను మాట్లాడానని తెలిపారు. సభలో తాను మాట్లాడిన మాటలకు మైనార్టీ ప్రజలు నొచ్చుకొని ఉంటే క్షమాపణ కోరుతున్నానని తెలిపారు. టిడిపి వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు ఇచ్చిందని తానే బహిర్గతంగా మాట్లాడానని పేర్కొన్నారు. దొంగచాటునా రాజ్యసభలో ఓటింగ్‌కు వైసిపి నేతలు హజరైంది వాస్తవం కాదాని ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో తక్కెల షరీఫ్, టైర్ల మాబు, ఫయాజ్, రజాక్, జబిబుల్లా, అబ్దుల్, కాలనీ బాషా, ఇలియాస్ పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

రేషన్ కార్డు దారులు అందరికీ ఇబ్బందులు లేకుండా రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహశీల్దార్ సుధీర్ తెలిపారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రేషన్ షాపుల డీలర్లుతో రేషన్ బియ్యం పంపిణీపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక నుండి డీలర్లుకు సరఫరా చేసే బియ్యంలో ఎలాంటి కోతలు లేకుండా చేస్తామని చెప్పారు. ప్రతి నెల ప్రతి డీలర్ కూడ అందరికీ బియ్యం పంపిణీ చేయాలని కోరారు. అడిగిన వారందరికి నిత్యవసర సరుకులను పంపిణీ చేయాలని సూచించారు. బియ్యం కోట కూడా పెంచనున్నట్లు తెలిపారు. తూకాల్లో మోసాలు లేకుండా చేయాలన్నారు.

మోడీ పాలనలో వ్యవస్థలు దుర్వినియోగం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మోడీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తుందని కాంగ్రెస్ నాయ కులు తులసిరెడ్డి పేర్కొ న్నారు. బుధవారం ఆయన స్థానిక విలేక రులతో మాట్లా డారు. కాంగ్రెస్ నాయకులు సోని యా గాంధీ, రాహుల్ గాంధీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ఢిల్లీలోని హౌస్ అవెన్యూ ప్రత్యేక కోర్టులో మంగళవారం చార్జిషీట్ వేయడం గర్హనీ యమన్నారు. ఇది మోడీ ప్రభుత్వ రాజకీయ కక్షకు పరాకాష్ట అన్నారు. మోడీ ప్రభుత్వ తాటాకు చప్పుళ్లకు, ఉడుత ఊపులకు కాంగ్రెస్ భయపడదని తెలిపారు. ప్రజాస్వామ్య పద్ధతిలో చట్టపరంగానే పోరాడుతామన్నారు. రాజధానికి ఎన్నిసార్లు శంకుస్థాపన చేస్తారని ఆయన ప్రశ్నించారు. గత పదేళ్లలో రాష్ట్రంలో 2019 వరకు చంద్రబాబు ప్రభుత్వం, తర్వాత 2024 వరకు జగన్ ప్రభుత్వం ఉండగా కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఉందన్నారు. రాజధాని నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉండిపోయాయన్నారు. విభజన చట్టంలో సెక్షన్ 94 ప్రకారం రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వాల్సి ఉన్నా మోడీ ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. రాజధానికి కావలసింది నిధులు.. మళ్లీ మళ్లీ శంకుస్థాపనలు కాదని తులసిరెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు పూల నజీర్, అలీ, సుజిత్, బాబా, ఖాజా, అమర్నాథరెడ్డి, ఉత్తన్న, జయరాంరెడ్డి, రమణ నాగరాజు, వినయ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎన్.తులసిరెడ్డి

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ పాండురంగన్ రవి

నేర్చుకున్న విద్యతో ఉన్నత స్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రెండేళ్ల కాలంలో నేర్చుకున్న విద్య మీరు ఉన్నతస్థాయికెదిగేందుకు వినియోగించుకోవాలని ప్రిన్సిపల్ పాండురంగన్ రవి తెలిపారు. స్థానిక సాయిరాజేశ్వరి ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఎంబిఎ విద్యార్థులకు ఫేర్వెల్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఏ సంస్థలో పని చేస్తున్నా జూనియర్లుకు సపోర్ట్ చేస్తూ మీరు సక్సెస్ సాధించాలన్నారు. ఎంబిఎ హెచ్ఒడి డాక్టర్ షబానాబి మాట్లాడుతూ యాజమాన్యం, ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, హెచ్ఒడిల సంపూర్ణ సహకారంతో తాను హెచ్ఒడి బాధ్యతను నిర్వహిస్తున్నానని తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరెడ్డి, హెచ్ఒడిలు మాట్లాడుతూ మంచి నిర్ణయాలతో సమాజానికి, తల్లితండ్రులకు గౌరవం తెచ్చేలా మీరు ఉండాలని సూచించారు. సీనియర్ విద్యార్థి మహిత మాట్లాడారు. కార్యక్రమంలో చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీర కుమార్ రెడ్డి, కరస్పాడెంట్ వీర కల్యాణ్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుంచి అంకాలమ్మ తిరుణాల

- 24న బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని అంకాలమ్మ గూడూరులో వెలసిన శ్రీఅంకాలమ్మ అమ్మవారు తిరుణాల గురువారం నుంచి ప్రారంభం కానుననట్లు ఆలయ కమిటీ చైర్మన్ సోమ కొండారెడ్డి, గ్రామస్తులు తెలిపారు. రాయలసీమ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీఅంకాలమ్మ తల్లి తిరుణాల సందర్భంగా ప్రతి ఏడాది ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. ఇందులో భాగంగా న్యూ కేటగిరి కింద 24న ఎడ్లచే బండలాగుడు పోటీలు ఏర్పాటు చేశామన్నారు. తిరుణాల కార్యక్రమాలు ఈనెల 27న ముగుస్తాయన్నారు. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

నూతన ఆప్కాస్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

సిఐటియు ఆధ్వర్యంలో ఆప్కాస్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జమ్మలమడుగు డివిజన్ కమిటీని ఎన్నుకున్నట్లు సిఐటియు పట్టణ ఉపాధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో బుధవారం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులుగా జి.చెన్నయ్య, రేణుకాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగు ప్రభుత్వ హాస్పిటల్‌లో ఆప్కాస్ కార్మికులతో సమావేశం నిర్వహించి కమిటీ వేశామన్నారు. రాష్ట్రంలో ఉన్న ఆప్కాస్ కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం సిఐటియు కార్మికుల సంఘం కృషి చేస్తుందన్నారు. ఆప్కాస్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కమిటీ సభ్యులుగా వల్లి, కరిముల్లా, గోపాల్, డానియల్, జి.కుమార్, బాలు, కృప, రవి, కె.కుమార్, అశ్వత్, భానుమూర్తి, కీర్తన, లక్ష్మి, బాలు, సాయి, రవి, నాగేష్, రాజేశ్వరి, రాధస్వరూప, ప్రీతి విద్యలతను ఎన్ను కున్నారు.

రాయితీ యంత్ర పరికరాలు పంపిణీ

లింగాల : వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు వ్యవసాయ పనుల నిమిత్తం రాయితీ పవర్ స్ప్రేయర్లను పంపిణీ చేశారు. మండల పరిధిలోని పార్నపల్లె, వెలిదండ్ల, రైతు సేవా కేంద్రంలో బుధవారం వ్యవసాయాధికారి రమేష్ రైతులులకు పంపిణీ చేశారు. ట్రాక్టర్లలతో నడిపే పరికరాలు అందుబాటులో ఉన్నాయని కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతు సేవా సిబ్బంది ప్రసన్న, హుస్సేన్ బాషా పాల్గొన్నారు.

ముద్దనూరు : సస్య రక్షణ విభాగం కింద ప్రభుత్వం రాయితీ ద్వారా రైతులకు పవర్ స్ప్రేయర్లు అందిస్తుందని వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. కొలవలి, ఉప్పలూరు, యామవరం రైతులకు మంజూరైన పవర్ స్ప్రేయర్లు ఎఒ ఆధ్వర్యంలో అందజేశారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దని, పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని ఎస్ఐ రాఘవేంద్ర రెడ్డి సూచించారు. బుధవారం స్థానిక ప్రొద్దుటూరు మాదూరు బైపాస్ రోడ్డులో ప్రొద్దుటూరు డిఎస్పీ భావన ఆదేశాల మేరకు వాహనాలు తనిఖీ చేపట్టారు. కార్యక్రమంలో టూ టౌన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి - చెన్నూరు

కడప-కర్నూలు జాతీయ రహదారి చెన్నూరు కొత్త రోడ్డులో ఆటోను ఐషర్ వాహనం ఢీకొనడంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందినట్లు సిఐ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి.. బుధవారం తెల్లవారుజామున అరుంధతి నగర్‌కు చెందిన లక్ష్మీగండ్ల బాలమ్మ వ్యక్తిగత అవసరాల కోసం కడప ఆటోలో వెళుతుండగా చర్చి ఎదురుగా ఆటోను ఐషర్ వాహనం ఢీకొంది. కేసు దర్యాప్తు ఆయన తెలిపారు.

జంగాలపల్లిలో జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - పెద్దముడియం

మండల పరిధిలోని జంగాలపల్లి గ్రామంలో బుధవారం అయిదుగురు జూదారులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ సుబ్బారావు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.11వేలు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

27 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

- ముగ్గురు అరెస్టు.. పోలీసులకు రివార్డు

ప్రజాశక్తి - చాపాడు

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో దొంగలించిన 27 ద్విచక్ర వాహనాలను చాపాడు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మైదుకూరు డిఎస్‌పి రాజేంద్ర ప్రసాద్ అందించిన వివరాల ప్రకారం.. పులివెందుల వెలిదండు ప్రాంతానికి చెందిన ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనాలను దొంగతనం చేసి అమ్మకాలు చేపట్టేవారన్నారు. ఈ నేపథ్యంలో చాపాడు మండలం అల్లాడుపల్లె వద్ద వాహన తనిఖీలు చేపడుతుండగా పవన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మరో ఇద్దరు యువకులు మూడు ద్విచక్ర వాహనాలను తరలిస్తున్నారని, వారి వద్ద వివరాలను చూపించాలని అడగగా పారిపోయే ప్రయత్నం చేశారన్నారు. ట్రైనీ డిఎస్‌పి భవాని, రూరల్ సిఐ శివశంకర్, ఎస్ఐ చిన్న పెద్దయ్య, సిబ్బంది కలిసి వీరిపై సమగ్ర విచారణ చేపట్టి 27 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారన్నారు. ద్విచక్ర వాహనాలను గుర్తించడంలో గట్టి ప్రయత్నం చేసినందుకు జిల్లా ఎస్పీ వీరికి నగదు రివార్డు కూడా అందజేశారన్నారు. ముగ్గురు యువకులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బందికి నగదు రివార్డు అందజేస్తున్న డిఎస్‌పి